

పేదల ఆరోగ్యానికి మరింత భరోసా







ఆరోగ్యశ్రీతో పేదల ఆయుష్షును నిలిపి, వారి గుండెల్లో చెరగని ముద్ర వేశారు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి. ఆ పథకానికి మరిన్ని మెరుగులద్ది ప్రజలకు మరింత చేరువ చేసి తండ్రికి తగ్గ తనయుడిగా ప్రజల మన్ననలు అందుకుంటున్నారు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి. వైద్యం కోసం పేదలు ఇబ్బంది పడకూడదని, ఎవరూ అప్పులపాలు కాకూడదనే ఉద్దేశంతో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స వ్యయ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచుతూ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. నియోజకవర్గంలో ఎంతో మంది పేదలు ఈ పథకం ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత సేవలు పొందుతున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.



76వ వార్డు రామచంద్రనగర్‌లో ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు (ఫైల్)

- ప్రతిష్టాత్మకంగా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ అమలు
- పరిమితి రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంపు
- ఆరోగ్య ఆసరాతో రోగులకు సాయం
- సేవలపై సర్వత్రా హర్షం

గాజువాక : పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకువచ్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పరిచయం చేసిన ఈ పథకం ద్వారా పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి వచ్చింది. దీంతో ఇది తిరుగులేని పథకంగా నిలిచింది. ఆయన మరణం తరువాత ఈ పథకం అనేక ఆటుపోట్లకు గురైనా.. ఆయన కుమారుడు జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారు. నిన్న మొన్నటి వరకు ఈ పథకం ద్వారా పొందే సేవల విలువ రూ.5 లక్షలు ఉన్న సంగతి తెలిసిందే. పేదలకు ఎలాంటి పెద్ద జబ్బు చేసినా వైద్యానికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఆ మొత్తాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రూ.25 లక్షలకు పెంచారు.

4,172 మందికి ప్రయోజనం

ఈ పథకం ద్వారా వైద్య సేవలతో పాటు రవాణా, భోజన, వసతి సౌకర్యాలను కూడా అందిస్తున్నారు. ఈ పథకం ద్వారా గాజువాక నియోజకవర్గంలో ఇప్పటివరకు 4,172 మంది ప్రయోజనం పొందారు. ఈ పథకం కింద ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో నమోదైనవారికి కూడా ఉచిత వైద్య సేవలను అందిస్తున్నారు.

ఈ పథకం కింద 1059 రోగాలకు సేవలను అందిస్తుండగా ఆ సంఖ్యను 2434కు పెంచినట్టు ప్రభుత్వం గతంలోనే ప్రకటించింది. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి పెద్ద పెద్ద నగరాల్లో కూడా ఆరోగ్యశ్రీ కార్డుద్వారా వైద్యం చేయించుకొనే అవకాశాన్ని కల్పించింది. ఈ కార్డుద్వారా నగదు రహిత వైద్య సేవలను పొందవచ్చు. వైద్యం ఖర్చు రూ.1000 దాటితే ఈ పథకం వర్తిస్తుంది.

'వైఎస్సార్ ఆరోగ్య ఆసరా'తో 1054మందికి లబ్ధి

వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో పాటు జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మరో పథకం వైఎస్సార్ ఆరోగ్య ఆసరా. పేద, మధ్య తరగతి కుటుంబాల్లో సంపాదించే వ్యక్తులు శస్త్ర చికిత్సలు చేయించుకొని విశ్రాంతి తీసుకునే సమయంలో ఆ కుటుంబాన్ని అనేక ఆర్థిక సమస్యలు చుట్టుముడతాయి. రోజు గడవడం కూడా కష్టంగా మారొచ్చు. ఈ పరిస్థితులను గుర్తించిన ముఖ్యమంత్రి అలాంటివారి కోసం వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకాన్ని తీసుకొచ్చారు. ఈ పథకం కింద శస్త్ర చికిత్సల అనంతరం వైద్యులు సూచించే సమయానికి రోజుకు రూ.225 చొప్పున గాని, లేదా గరిష్టంగా రూ.5వేలు చొప్పున గాని ప్రభుత్వం సాయం అందిస్తుంది. 836 రకాల సర్జరీలకు ఈ స్కీమ్ వర్తిస్తుంది. వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద చెల్లించే డబ్బులు నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోనే జమ అవుతాయి. ఈ పథకం కింద గాజువాక నియోజకవర్గంలో ఇప్పటివరకు 1,054 మంది లబ్ధి పొందారు.

వైఎస్సార్ ఆరోగ్య ఆసరా

సంవత్సరం	లబ్ధిదారులు	లబ్ధి మొత్తం(రూ.)
2019-20	115	53,19,146
2020-21	42	3,71,050
2021-22	35	2,63,250
2022-23	862	7,60,613
నాలుగు విడతల్లో లబ్ధిదారులకు జమ అయిన నగదు		67,14,059

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ లబ్ధిదారులు

సంవత్సరం	లబ్ధిదారులు	లబ్ధి మొత్తం(రూ.)
2019-20	2102	2,07,46,894
2020-21	672	1,68,24,712
2021-22	1116	2,67,21,043
2022-23	282	1,40,23,635
నాలుగు విడతల్లో లబ్ధిదారులు పొందిన మొత్తం లబ్ధి		7,83,16,284

ఆరోగ్యశ్రీ నా ప్రాణాలను కాపాడుతోంది



నేను షిప్‌యార్డులో ఉద్యోగం చేసి రిటైరయ్యాను. మాకు పెన్షన్ చాలా తక్కువగా వస్తుంది. ఆ ఆదాయంతోనే నేను, నా భార్య బతకాలి. నాకు 2023 ఆగస్టు నుంచి కిడ్నీ సమస్యలు ఎదురయ్యాయి. డయాలసిస్ అవసరమని డాక్టర్లు చెప్పారు. దీంతో నేను ఆరోగ్యశ్రీ ద్వారా శ్రీహరిపురంలోని సెయింట్ ఆన్స్ ఆస్పత్రిలో గతేడాది సెప్టెంబర్ నుంచి డయాలసిస్ చేయించుకుంటున్నాను. ఒక్కసారి డయాలసిస్ చేయించుకోవాలంటే రూ.1200 ఖర్చు అవుతుంది. వారంలో మూడు సార్లు డయాలసిస్ చేయించుకోవాలి. నాకు షిప్‌యార్డు నుంచి వచ్చే కొద్దిపాటి పెన్షన్ తప్ప వేరే ఆదాయం లేదు. ఈ పరిస్థితుల్లో ఆరోగ్యశ్రీ నా ప్రాణాలను కాపాడుతోంది. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా రెండు సార్లు డాక్టర్లు ఇంటికి వచ్చి వైద్య పరీక్షలు చేశారు. సచివాలయ ఏఎన్ఎం కూడా ఇంటికి వచ్చి నన్ను పరీక్షించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంది. పేద ప్రజల ప్రాణాలు విలువ తెలిసిన జగన్ మోహన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు. – **సాగి అచ్యుతరావు**, అక్కిరెడ్డిపాలెం

ఆరోగ్యశ్రీ దయ వల్ల నడవగలుగుతున్నాను



నేను పెయింటింగ్ పనులు చేసేవాడిని. ఆ తరువాత మోకాళ్ల నొప్పులు రావడంతో నడవలేని పరిస్థితికి వచ్చేశాను. నా మోకాలి చిప్పలు అరిగిపోయాయని డాక్టర్లు చెప్పారు. ఏడాది క్రితం వరకు కూర్చుంటే లేవలేకపోయేవాడిని, నిలబడితే కూర్చోడానికి చాలా ఇబ్బంది. పనులు మానేయడం వల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో వార్డు వలంటీర్ ద్వారా ఆరోగ్యశ్రీ సిబ్బందిని సంప్రదించాను. ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ అవుతుందని చెప్పడంతో పాటు గతేడాది జూలై నెలలో షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్‌లో మోకాలు చిప్ప ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం నేను ఎటువంటి ఇబ్బంది లేకుండా నడవగలుగుతున్నాను. ఆపరేషన్‌కు అయిన రూ.60వేలతోపాటు మూడు మాసాలకు సరిపడా మందులు, బలవర్ధకమైన ఆహారం కోసం నా చేతికి రూ.9వేలు అందించారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దయవల్ల నేను నా పనులు చేసుకోగలుగుతున్నాను. – **పెదిరెడ్ల రమణ**, అగనంపూడి

ముఖ్యమంత్రికి నేతల సాదర స్వాగతం







సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి చందు, ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్

గాజువాక : విశాఖ పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉరుకూటి చందు హెలీప్యాడ్ వద్ద మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి నాగిరెడ్డి, చందు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. వారిద్దరితో ముఖ్యమంత్రి వేర్వేరుగా ముచ్చటించారు.

సీఎం జగన్‌ను కలిసిన రాజశేఖర్

ఉక్కునగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ నాయకుడు మంత్రి రాజశేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, విశాఖలో వైఎస్సార్‌సీపీ వ్యవహారాల గురించి ఆయన ముఖ్యమంత్రికి వివరించారు.

ముఖ్యమంత్రిని కలిసిన వంశీరెడ్డి

పెదగంట్యాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం



సమావేశంలో ప్రసంగిస్తున్న చందు

గాజువాక : అభివృద్ధి, సంక్షేమం కోసం జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాల్సిన అవసరం ఉందని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు అన్నారు. దీనికి అందరూ సహకరించాలని కోరారు. జీవీఎంసీ 71వ వార్డు విశ్వేశ్వరాయనగర్ ఫ్లాట్ యజమానులతో చందు మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఆయన్ను మళ్లీ సీఎం చేసుకోవడం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు, నాయకులు ఉరుకూటి అప్పారావు, రెడ్డి జగన్నాథం, సోమరాజు, వై.వి.అప్పారావు, చంద్రశేఖర్, నూకా రెడ్డి, త్రినాథ్, రమేష్, అప్పలనాయుడు, మురళీధర్, మాడిసి రాము తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం



దివ్యజ్యోతి భవనంలో ఏర్పాటు చేస్తున్న జ్యోతిర్లింగాలు

అగనంపూడి: బ్రహ్మకుమారీస్ అగనంపూడి (దివ్యజ్యోతి భవనం) ఆధ్వర్యంలో బుధవారం నుంచి ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం కల్పించనున్నట్లు ఇన్‌చార్జి బీకే రామకోటి తెలిపారు. మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని దేశంలోని ప్రసిద్ధ శివాలయాలు, లింగాల నమూనాలను బ్రహ్మకుమారీస్ సంస్థ ఏర్పాటు చేస్తోంది. మూడు రోజుల నుంచి ద్వాదశ జ్యోతిర్లింగాల నమూనాల ఏర్పాటు ప్రక్రియ చేపట్టారు. బుధవారం ఉదయం పది గంటలకు రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, రాజయోగిని బీకే వేణి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. జ్యోతిర్లింగాలను దర్శించి, ఈశ్వరీయ ప్రసాదం స్వీకరించాలని కోరారు.

మహాశివరాత్రికి పకడ్బందీగా ఏర్పాట్లు

- ఆర్డీవో హుస్సేన్ సాహెబ్
- అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయంలో అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

పెదగంట్యాడ: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ ఆదేశించారు. ఈ నెల 8న మహాశివరాత్రిని పురస్కరించుకుని 77వ వార్డు అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయంలో మహోత్సవాలను నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈ మేరకు ఆలయ ఆవరణలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష్, డీసీపీ మోకా సత్యనారాయణ, ఏసీపీ త్రినాథ్‌తో పాటు ఇతర శాఖాధికారులతో మంగళవారం ఆలయ ఆవరణలో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఆలయానికి అధిక సంఖ్యలో వచ్చే భక్తులు రాత్రంతా ఇక్కడే జాగరణ చేసి, మరుసటిరోజు ఉదయం సోమేశ్వరస్వామిని దర్శించుకుంటారు కనుక ఎక్కడా లోటుపాట్లు లేకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. మొబైల్ టాయిలెట్ల సంఖ్య పెంచాలని, తాగునీటి సదుపాయంతో పాటు సముద్ర స్నానాలు చేసిన వెంటనే భక్తులు దుస్తులు మార్చుకునేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సముద్రంలో స్నానాలు చేసే సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుండా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని డీసీపీ ఆదేశించారు. వాహనాల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, దేవాదాయ శాఖ అధికారులు రాజగోపాల్‌రెడ్డి, ఈవో జగన్నాథం, దువ్వాడ పోలీస్ స్టేషన్ సీఐలు ఎర్రం నాయుడు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ్మూర్తి పోరాటాలు స్ఫూర్తిదాయకం



శ్రీరామ్మూర్తిని సత్కరిస్తున్న వివిధ సంఘాల నాయకులు

గాజువాక : పౌర హక్కుల సంఘం నేత తుంపాల శ్రీరామ్మూర్తి పోరాట తెగువ, సమస్యలపై అధ్యయనం చేసే విధానం అందరికీ స్ఫూర్తిదాయకమని సీపీఐ సీనియర్ నేత ఎ.జె.స్టాలిన్ అన్నారు. దళిత, గిరిజనుల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాలు ఎంతో ధైర్యసాహసాలతో కూడుకున్నవని అన్నారు. శ్రీరామ్మూర్తి ఆరు దశాబ్దాల పోరాట ప్రస్థానం సందర్భంగా గాజువాకలో ఆయన్ను వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ శ్రీరామ్మూర్తి నిర్వహించిన వివిధ పోరాటాలను వివరించారు. హైకోర్టు న్యాయవాది పిచ్చుక శ్రీనివాస రావు మాట్లాడుతూ శ్రీరామ్మూర్తి పోరాటాలు, ఆయన జీవిన విధానం నేటి యువతకు ఆదర్శమన్నారు. అనంతరం శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ తన 78 ఏళ్ల వయస్సులో 64 ఏళ్లు పోరాటాల్లోనే జీవించానని తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు బసా సాధురెడ్డి, కొత్తపల్లి వెంకటరమణ, ఎస్.ఆర్.వేమన, కె.పరంధామయ్య, బూసి పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నడుపూరు హైస్కూల్‌లో ఎన్ఎస్ఎస్ క్యాంప్



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

పెదగంట్యాడ: ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకంలో భాగంగా నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 50 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మంగళవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల పరిసరాల్లోని చెత్త తొలగించి శుభ్రం చేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ పథకాలు, ఆరోగ్యం, సామాజిక సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్స్ పి.ప్రదీప్‌కుమార్, ఎం.సత్యప్రకాష్, 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, ఎన్ఎస్ఎస్ పీవో కె.శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలతోనే ఉక్కు పరిరక్షణ



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశ ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వరంగ సంస్థలే ఆధారమని, అటువంటి సంస్థలను ప్రైవేటీకరించడం సరికాదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఐక్య ఉద్యమాలతో ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకుంటామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1118వ రోజు, మంగళవారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని, నిర్వాసితులను, నిరుద్యోగులను నడిరోడ్డుపై పడేసే విధంగా కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలను ఉద్యమాల ద్వారా అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

కార్మికులకు సన్మానం

అగనంపూడి: విశాఖ ఉక్కు భద్రతా పోటీల్లో బహుమతులు పొందిన అగనంపూడికి చెందిన ముగ్గురు కాంట్రాక్ట్ కార్మికులను అఖిలపక్షాల నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ పోటీల్లో బలిరెడ్డి శ్రీను, చట్టి వెంకట అప్పారావు, డి.వి.ఎస్. నరసింగరావు నగదు బహుమతిని, ప్రశంసాపత్రాలను అందుకున్నారు. ఈమేరకు అగనంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో వారిని సత్కరించారు. సీడబ్ల్యూసీ కార్యదర్శి కరణం పైడిరాజు, ఉక్కు అఖిలపక్షాల కార్మిక సంఘాల నాయకులు సాయిన సన్యాసిరావు, పెదిరెడ్ల నీలకంఠం, బలిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీఈఆర్‌టీ బృందం సందర్శన



ప్రభుత్వ పాఠశాలలో ఎన్‌సీఈఆర్‌టీ ప్రతినిధులు

కూర్మన్నపాలెం: గాజువాక మండలం కూర్మన్నపాలెం పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలను, కూర్మన్నపాలెంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను న్యూఢిల్లీకి చెందిన జాతీయ విద్యా పరిశోధనా శిక్షణ సంస్థ (ఎన్‌సీఈఆర్‌టీ) ప్రతినిధులు మంగళవారం సందర్శించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించారు. పాఠశాలలో కల్పిస్తున్న వసతులు, రికార్డులు, మధ్యాహ్న భోజన సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఎన్‌సీఈఆర్‌టీ ప్రతినిధులు దిలీప్ శర్మ, నిఖిత, సోమయాజులు, గాజువాక ఎంఈవోలు విశ్వనాథం, ఎం.సునీత తదితరులు పాల్గొన్నారు.

'మెడికల్ అన్‌ఫిట్ కార్మికులకేనా?'

అగనంపూడి: అనారోగ్యాన్ని కారణంగా చూపించి, ఉక్కు యాజమాన్యం ఇటీవల 31 మందిని తొలగించడం అన్యాయమని సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు పేర్కొన్నారు. ఈ నిబంధన కేవలం కార్మికులకే వర్తిస్తుందా లేక అన్ని స్థాయిల్లోని సిబ్బంది, అధికారులకు వర్తిస్తుందా తెలియజేయాలని డిమాండ్ చేశారు. అగనంపూడిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం బాగాలేదనే నెపంతో 31 మందిని ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తొలగించారని, ఆ తొలగింపు ఉత్తర్వులు అందించిన అధికారి నడవలేని, మాట్లాడలేని పరిస్థితుల్లో ఉన్నారని, మరి ఆ అధికారికి ఈ రూల్ వర్తించకపోవడం అన్యాయమని నిలదీశారు. నిబంధనలు అన్ని స్థాయిల ఉద్యోగులకు ఒకే విధంగా ఉండాలి తప్ప, కార్మికులకు ఒకలా, అధికారులకు మరోలా ఎలా వర్తింపజేస్తారని ప్రశ్నించారు. యాజమాన్యం వైఖరి వల్ల ఉక్కు దివాలా తీసిందని, ఇప్పటికైనా ద్వంద ప్రమాణాలు మానుకోవాలని అన్నారు. సమావేశంలో శ్రీనివాసరావు, రామారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

గాజువాక : కేంద్ర ప్రభుత్వ ఉజ్వల పథకం ద్వారా మంజూరైన గ్యాస్ కనెక్షన్లను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు మంగళవారం మహిళలకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్యాస్ కనెక్షన్లు లేనివారికి కేంద్ర ప్రభుత్వం ఉజ్వల పథకం ద్వారా ఉచితంగా కనెక్షన్లను మంజూరు చేస్తుందని, ఈ అవకాశాన్ని అర్హులందరూ వినియోగించుకోవాలని కోరారు. నాయకులు లక్కరాజు సోంబాబు, శశిధరణ్ పిళ్లై, శంకరరావు, రవి కుమార్, తేజస్వి, గీతాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

నగరాల కార్పొరేషన్ చైర్మన్‌కు సత్కారం

పెదగంట్యాడ: నగరాల అభ్యున్నతి కోసం పాటు పడతానని నగరాల కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాస్ అన్నారు. జీవీఎంసీ 64వ వార్డు యారాడ గ్రామంలో ఆయనను మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానన్నారు. ఈ నెల 6న మధురవాడలోని రేవళ్లపాలెంలో నిర్వహించనున్న నగరాల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్లు గుజ్జారి లలిత, పార్వతి, గ్రామ పెద్దలు బంక రాము, మధు, అప్పారావు, బంక అప్పారావు, అచ్చారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు కార్మికులకు వేతనాల చెల్లింపునకు వినతి



స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం గాంధీతో సమావేశమైన నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని ఉక్కు నాన్ జేసీఎం సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జీతాల అంశంపై హెచ్‌ఆర్ సీజీఎం జి.గాంధీని నాయకులు మంగళవారం కలిశారు. రూ. 2100 కోట్లు సేల్స్ జరిగినా కార్మికులకు జీతాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. వెంటనే జీతాల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సీజీఎం సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వై.మస్తానప్ప, జి.గణపతిరెడ్డి, జగదీష్, కొమ్మినేని శ్రీనివాసరావు, వరసాల శ్రీనివాసరావు, నమ్మి సింహాద్రి పాల్గొన్నారు.

క్లుప్తంగా

శాస్త్రోక్తంగా రుద్ర హోమం



రుద్ర హోమం చేస్తున్న రుత్వికులు

ఉక్కునగరం: స్థానిక సెక్టర్-3 కాంప్లెక్స్‌లో కొలువుదీరిన వరసిద్ధి వినాయక ఆలయంలో మంగళవారం రాత్రి రుద్ర హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ 18వ వార్షిక వేడుకల సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు ఐ.వి. శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

వెండి చీరలో పార్వతీ దేవి దర్శనం



వెండి చీర అలంకరణలో పార్వతీదేవి

పెదగంట్యాడ: పార్వతీ మాత రజత వస్త్రాలంకరణలో మంగళవారం దర్శనమిచ్చారు. జీవీఎంసీ 76వ వార్డు బాలచెరువులోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన అమ్మవారిని మంగళవారం వెండిచీరతో అలంకరించారు. భక్తులు, దాతల సహకారంతో 2 కిలోల వెండితో పార్వతీదేవికి చీర తయారు చేయించామని ఆలయ అర్చకుడు బంకుపల్లి వాసుదేవ శర్మ తెలిపారు. అమ్మవారికి ఆ చీరను అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించామని చెప్పారు.

'స్టీల్‌ప్లాంట్' అంశంపై ఒత్తిడి పెంచాలి



మంత్రి రాజేంద్రనాథ్‌ను కలిసిన వ్యాసశర్మ

అగనంపూడి: విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించేలా ప్రధానమంత్రిపై ఒత్తిడి తీసుకువచ్చేలా కృషి చేయాలని రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌ను ఐబీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ధర్మాల వ్యాసశర్మ కోరారు. విశాఖ విచ్చేసిన మంత్రి రాజేంద్రనాథ్‌ను కలిసిన ఆయన ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఉక్కు ఉత్పత్తికి విఘాతం కలిగిస్తోందని, నిర్వాసితులకు ఉపాధి కల్పించకుండా అన్యాయం చేస్తోందని పేర్కొన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ప్రైవేటీకరణ యత్నాలను విరమింపజేసేలా కృషి చేయాలని కోరారు.

ఘనంగా వార్షిక క్రీడా దినోత్సవం



విజేతలతో స్టీల్‌ప్లాంట్ జీఎం సంజీవరావు, యాజమాన్యం ప్రతినిధులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అరబిందో ఐడియల్ హైస్కూల్ వార్షిక క్రీడా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమానికి స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ కె.సంజీవరావు ముఖ్య అతిథిగా హాజరై, క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ వి.రామారావు, ఎం.వి.ఆర్. కళాశాల ప్రిన్సిపాల్ వై.ఈశ్వరరాజు, అరబిందో ప్రిన్సిపాల్ షాజిమోన్ జోసెఫ్, కో-ఆర్డినేటర్ టి.ఎల్లేశ్వరరావు, ప్రధానోపాధ్యాయిని రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.